# ప్రజాస్వరం

PRAJASWARAM

తెలుగు దినపత్రిక

MHR TV

www.MHRtv.com

మెదక్ | సంపుటి: 18 సంచిక: 149 | శుక్రవారం, 11 ఏప్రిల్ 2025 | పేజీలు: 06 వెల: రూ.1

Circulated By: Hyderabad-Medak-Sangareddy-Nalgonda-Warangal-Nizamada-Vijayawada-Guntur-Vizag Adilabad Kurnool | www.prajaswaramdaily.com


## విశ్వసనీయతే మన పార్టీ సిద్ధాంతం..

ఉమ్మడి కర్నూలు జిల్లా
వైసీపీ నేతలతో
వైఎస్ జగన్ సమావేశం..
విలువలు, విశ్వసనీయతే
మన పార్టీ సిద్ధాంతం..
ఈ సిద్ధాంతాన్ని
నేను గట్టిగా నమ్ముతాను..
కేవలం ఇచ్చిన మాటకోసం..
ఎందాకైనా వెళ్లాం..
ఆ ప్రస్థానంలో
వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ
ఆవిర్భవించింది..



02

## ఒక్కొక్కరికి ఒక్కో బ్రాండ్ ఉంటుంది..

# నా బ్రాండ్ ఇదే..

యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు

ఒక్కొక్కరికి ఒక్కో బ్రాండ్ ఉంటుంది.. నా బ్రాండ్ యంగ్ ఇండియా

ఎవరికి నచ్చినా నచ్చకపోయినా.. పీవీ సంస్కరణలు గుర్తించాల్సిందే..



**హైదరాబాద్ ఏప్రిల్ 10(ప్రజాస్వరం):**

భారతదేశం ఇప్పుడు ప్రపంచదేశాలతో పోటీ పడుతోందంటే అందుకు ఆనాడు నెహ్రూ చూపిన దార్శనికతే కారణమన్నారు సీఎం రేవంత్ రెడ్డి. రంగారెడ్డి చిల్లా మంచిరేవులలో ఆయన యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలీసు శాఖపై తనకు స్పష్టమైన ఆలోచన ఉందని చెప్పారు. అనంతరం భారతదేశ విద్యావ్యవస్థ గురించి మాట్లాడుతూ.. ప్రస్తుతం దేశంలో ఉన్న గొప్ప

మిగతా 2వ పేజీలో

## వడగండ్ల వానలకు నష్టపోయిన రైతులను

# ఆదుకోవాలి..

**రైతులు ధైర్యంగా ఉండాలని భరోసా**

రైతులను ఆదుకోవాలని హరీశ్‌రావు డిమాండ్

నష్టపోయిన రైతులకు

20 వేల రూపాయలు నష్ట పరిహారం చెల్లించాలి



**హైదరాబాద్ ఏప్రిల్ 10(ప్రజాస్వరం):**

అకాల వడగండ్ల వానలకు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని మాజీ మంత్రి హరీశ్ రావు డిమాండ్ చేశారు.. ఈసిద్దిపేట నియోజకవర్గంలో బుధవారం రాత్రి కురిసిన వడగండ్ల వాన అన్న దాతలకు తీవ్ర నష్టం చేసిందని, రైతుల అరుగాళ్ల కష్టం నేల పాలయ్యిందని ఆవేదన వ్యక్తం చేశారు.

నియోజకవర్గంలో వరి, మొక్కజొన్న, మామిడి పంటలపై అకాల వర్షం తీవ్ర నష్టం చేసిందన్నారు.. నష్ట పోయిన పంటలకు 20 వేల రూపాయల నష్ట పరిహారం చెల్లించాలని

మిగతా 2వ పేజీలో

## కాంగ్రెస్ అంటేనే కరప్షన్ అని మరోసారి రుజువైంది

డీఎస్సీ స్పోర్ట్స్ కోటాలో అవినీతిపై మండిపడ్డ రాకేశ్ రెడ్డి

మరోవైపు గ్రూప్ 1 ఫలితాల్లో గోల్ మాల్



02

## బీహెచ్ఈఎల్‌లో క్రికెట్ బెట్టింగ్ ముఠా

# గుట్టు రట్టు...

మాదాపూర్
ఎస్ఓటీ బృందం
బెట్టింగ్
నిర్వహిస్తున్న
ఇంటిపై దాడి
6 ఎకౌంట్స్ సీజ్
2.55 లక్షలు ఫ్రీజ్



02

## కాంగ్రెస్ అంటే కమీషన్లు

# దండుకోవడం


**కాంగ్రెస్ పాలనపై కేటీఆర్ ఫైర్**

**అభివృద్ధి అంటే భూములను చెరబట్టడం**

**బుల్డోజర్లను ఉసిగొల్పడం కాదు**

నాడు వాయువేగంతో ఎస్ఆర్డీపీ
పథకం కింద ఫ్లై ఓవర్లు,
అండర్ పాస్ బ్రిడ్జీలు

16 నెలల
కాంగ్రెస్ పాలనలో
నత్తనడకన
సాగుతున్న
పనులు




02

## గ్రామ స్థాయి నుంచి పార్టీ బలోపేతమే

# రాహుల్ లక్ష్యం

గ్రామీణ స్థాయి నుంచి
బూత్ కమిటీల వరకు
పార్టీ బలోపేతానికి
రాహుల్ ప్రాధాన్యం
కుల గణన సర్వేకు
కాంగ్రెస్
మద్దతు – సమాన
వనరుల పంపిణీ
లక్ష్యంగా నిర్ణయం
జిల్లా అధ్యక్షులు
విధాన నిర్ణయాల్లో
కీలకపాత్రలో ఉండాలని
ఏఐసీసీ నిర్ణయం



02

## హరీశ్‌రావుది వన్‌సైడ్ లవ్.. ఆయనకు ప్రేమ లేదు

కేసీఆర్‌కు హరీశ్ రావు మీద ప్రేమ లేదు

కానీ హరీశ్ రావుకు కేసీఆర్‌పై ప్రేమ ఉంది..

ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి హరీశ్ రావుపై తీవ్ర విమర్శలు

మీరు పడగొట్టిన రాష్ట్రాన్ని రేవంత్ రెడ్డి నిలబెట్టిండు


తెలంగాణలో మీకుటుంబమే నిలబడింది



02

## ఎయిర్‌పోర్టులో బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే షకీల్ అరెస్ట్

- బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే షకీల్ అరెస్ట్
- ఏడాదిన్నర క్రితం దుబాయ్ వెళ్లిపోయిన షకీల్
- తల్లి అంత్యక్రియల కోసం వచ్చి పోలీసులకు చిక్కిన షకీల్



02

## తుమ్మితే ఊడిపోయే ముక్కులాంటివి కాంగ్రెస్ ప్రభుత్వాలు

- తెలంగాణలో ఆ పార్టీ నుంచి రేవంత్ రెడ్డే చివరి సీఎం
- బీజేపీ ఎంపీ లక్ష్మణ్ సెటైర్



# కాంగ్రెస్ అంటే కమీషన్లు దండుకోవడం



**హైదరాబాద్ ఏప్రిల్ 10(ప్రజాస్వరం):**

ఎస్ఆర్డీపీ పథకం కింద హైదరాబాద్‌లో చేపట్టిన పనులు 16 నెలల కాంగ్రెస్ పాలనలో నత్తనడకన సాగుతున్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ (KTR) విమర్శించారు. పూర్తయినవాటికి సున్నాలేసి రిబ్బన్ కటింగ్ చేశారు కానీ నిర్మాణంలో ఉన్నవాటి పురోగతిని సమీక్షించకుండా గాలికి వదిలేశారని మండిపడ్డారు. కాంగ్రెస్ అంటే కమీషన్లు దండుకోవడం, కబ్జాలు చేసుకోవడం, కక్ష తీర్చుకోవడమేనా అని ప్రశ్నించారు. హైడ్రా, మూసీ పేరుతో పేదల ఇండ్ల కూల్చివేతల మీద ఉన్న శ్రద్ధ నిర్మాణాల మీద లేదా అని నిలదీశారు. అభివృద్ధి అంటే భూములను చెరబట్టడం, బుల్డోజర్లను ఉసిగొల్పడం కాదని ఎక్స్ వేదికగా దుయ్యబట్టారు.

“నాడు వాయువేగంతో ఎస్ఆర్డీపీ పథకం కింద ఫ్లై ఓవర్లు, అండర్ పాస్ బ్రిడ్జీలు

16 నెలల కాంగ్రెస్ పాలనలో నత్తనడకన సాగుతున్న పనులు

ఫలక్ నుమా ఆర్వోబీని పట్టించుకునే పరిస్థితి లేదు

ప్రతిపక్షాల మీద అక్రమ కేసులు పెట్టి చంచల్ గూడా జైలుకు పంపే శ్రద్ధ దాని ముందున్న ఫ్లై ఓవర్ పూర్తి చేయడంపై లేదు

శిల్పా లేఅవుట్ వద్ద అంతర్జాతీయ విమానాశ్రయానికి కలిపే రెండో లెవెల్ వంతెనది అదే దుస్థితి

శాస్త్రిపురం ఆర్వోబీ పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి

పూర్తయిన వాటికి సున్నాలేసి రిబ్బన్ కటింగులు చేశారు

నిర్మాణంలో ఉన్న వాటి పురోగతిని సమీక్షించకుండా గాలికి వదిలేశారు

కాంగ్రెస్ అంటే కమీషన్లు దండుకోవడం, కబ్జాలు చేసుకోవడం, కక్ష తీర్చుకోవడమేనా ?

హైడ్రా, మూసీ పేరుతో పేదల ఇండ్ల కూల్చివేతల మీద ఉన్న శ్రద్ధ నిర్మాణాల మీద లేదా!

అభివృద్ధి అంటే భూములను చెరబట్టడం, బుల్డోజర్ లను ఉసిగొల్పడం కాదు!” అంటూ కేటీఆర్ ట్వీట్ చేశారు.

# విశ్వసనీయతే మన పార్టీ సిద్ధాంతం..

- ఉమ్మడి కర్నూలు జిల్లా వైసీపీ నేతలతో వైఎస్ జగన్ సమావేశం..
- విలువలు, విశ్వసనీయతే మన పార్టీ సిద్ధాంతం..
- ఈ సిద్ధాంతాన్ని నేను గట్టిగా నమ్ముతాను..
- కేవలం ఇచ్చిన మాటకోసం.. ఎందాకైనా వెళ్లాం..
- ఆ ప్రస్థానంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భవించింది..

**కర్నూలు ఏప్రిల్ 10(ప్రజాస్వరం):**

విలువలు, విశ్వసనీయతే మన పార్టీ సిద్ధాంతం.. ఈ సిద్ధాంతాన్ని నేను గట్టిగా నమ్ముతాను అన్నారు వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి.. ఉమ్మడి కర్నూలు జిల్లా వైఎస్ఆర్సీపీ నేతలతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు జగన్.. ఈ సమావేశానికి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, మేయర్ బీవై రామయ్య, మాజీ ఎమ్మెల్యేలు శ్రీదేవి, శిల్పా రవి, కాటసాని రాంభూపాల్ రెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదన్ సహా పలువురు నేతలు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఇవాళ ఎలాంటి పరిస్థితులు ఉన్నాయో చూస్తున్నాం. వైసీపీకి మొదటి బీజం కర్నూలు జిల్లా నల్లకాలువలోనే పడింది. కేవలం ఇచ్చిన మాటకోసం.. ఎందాకైనా వెళ్లాం.. ఆ ప్రస్థానంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భవించింది. బలమైన పార్టీగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎదిగింది. ఆరోజు నుంచి నాతోనే మీరంతా అడుగులు వేశారు. పార్టీ పెట్టినప్పటి నుంచి ఇప్పటి వరకూ నాతోనే ఉన్నారు. రాజకీయాల్లో విలువలు, విశ్వసనీయతే మన పార్టీ సిద్ధాంతం. విలువలకు, విశ్వసనీయతకు అర్థం చెప్పిన పార్టీ.. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అన్నారు.. ఈ రెండు పదాలే పార్టీని నడిపించాయి. గట్టిగా ఈ సిద్ధాంతాన్ని నేను నమ్ముతాను. నాలో ఈరెండింటిని చూసి నాతోపాటుగా అడుగులో అడుగు వేశారని గుర్తుచేసుకున్నారు..

**రాజకీయాల్లో గెలుపు, ఓటములు సహజం..**

ఇవాళ్టికి కూడా పార్టీకి చెందిన ఏ నాయకుడైనా గర్వంగా కాలర్ ఎగరవేసుకుని ప్రజల వద్దకు వెళ్లగలడు అన్నారు వైఎస్ జగన్.. ప్రతి కుటుంబాన్ని చిరునవ్వుతో పలకరించి ఆశీస్సులు తీసుకునే కెపాసిటీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులకు మాత్రమే ఉందన్న ఆయన.. మనం రాకముందు రాజకీయాలు ఒకలా ఉండేవి. మనం వచ్చిన తర్వాత రాజకీయాలకున్న అర్థాన్ని మార్చాం. ఇచ్చిన మాటకు ఎవరైనా కట్టుబడి ఉండాలని చెప్పాం.. రాజకీయ అవసరాలకోసం గతంలో ఇష్టం వచ్చినట్టు మేనిఫెస్టో ఇచ్చేవారు. అధికారంలోకి వచ్చిన తర్వాత దాన్ని చెత్తబుట్టలో వేసేవారు. మనం వచ్చాక, మేనిఫెస్టోను ఒక పవిత్రమైన గ్రంథం మాదిరిగా భావించాం. ప్రతి అంశాన్నీ నెరవేర్చాలని తపన, తాపత్రయం పడ్డాం. కోవిడ్ ఉన్నా సరే అన్ని హామీలను నెరవేర్చాం. సంక్షోభం ఉన్నా, ఏరోజూ సాకులు వెతుక్కోలేదు. 99 శాతం పైచిలుకు హామీలను నెరవేర్చాం. గడపగడపకూ ప్రతి ఇంటికీ వెళ్లాం. ఇన్ని చేసినా మనం ఓటమి చెందామని ఆవేదన వ్యక్తం చేశారు.. చంద్రబాబు మాటలను ప్రజలు నమ్మారు. ప్రతి ఇంటికీ తన మనుషులను చంద్రబాబు పంపాడు. కరపత్రాలు, బాండ్లు చంద్రబాబు పేరిట పంచారు. ప్రతి వర్గాన్నీ మోసం చేశారు. దీనివల్ల పదిశాతం ప్రజలు చంద్రబాబును నమ్మారు. జగన్ చేశాడు కాబట్టి, చంద్రబాబు కూడా చేస్తాడని నమ్మారు. జగన్ కన్నా ఎక్కువ చేస్తానని చంద్రబాబు అన్న మాటలను నమ్మారు.. చంద్రబాబు మారాడేమోనని ప్రజలు నమ్మారు. అందుకే 50 శాతం నుంచి 40 శాతానికి ఓటు షేరు తగ్గిందని వివరించారు..

చంద్రబాబు వచ్చి 11 నెలలు అయిపోయింది. రెండు బడ్జెట్లు పెట్టాడు. చంద్రబాబు నాయుడు హామీలు నెరవేరుస్తాడని ఆశగా ఎదురుచూస్తున్నారు. మాట ఇచ్చాను కాని, ఇప్పుడు భయం వేస్తుందని చంద్రబాబు ఇప్పుడు అంటున్నాడు అని దుయ్యబట్టారు వైఎస్ జగన్.. రాష్ట్రానికున్న అప్పులపై అబద్ధాలు చెప్తున్నాడు. ప్రతిరోజూ అబద్ధాలు చెప్తున్నాడు. జగన్ ఉన్నప్పుడు నాలుగువేళ్లూ నోట్లోకి వెళ్లాయని ప్రజలు అనుకున్నారు. ఇప్పుడు ఉన్న ప్లేటును చంద్రబాబు లాగేశాడని అంటున్నారని వ్యాఖ్యానించారు.. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో పూర్తి తిరోగమనం. ఆరోగ్యశ్రీకి 3500 కోట్లు బకాయి పెట్టారు. వైద్యం చేయలేమని ఆస్పత్రులు చెప్తున్నాయి. ఏ రైతుకూ గిట్టుబాటు ధర రావడంలేదు. రైతులకు పెట్టుబడి సహాయం అందడంలేదు. ఫీజు రియింబర్స్‌మెంట్, వసతి దీవెన అందడంలేదు. పరిపాలనలో పారదర్శకత పూర్తిగా పక్కకు పోయిందని విమర్శించారు వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి.

# మాజీ ఎమ్మెల్యే షకీల్ అరెస్ట్..

**హైదరాబాద్ ఏప్రిల్ 10(ప్రజాస్వరం):**

బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే షకీల్‌ను పోలీసులు ఎట్టకేలకు అదుపులోకి తీసుకున్నారు. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఇవాళ ఆయన్ను అరెస్టు చేశారు. షకీల్‌పై పలు కేసుల్లో అరెస్టు వారెంట్లు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిలో ముఖ్యంగా 2023లో ప్రజా భవన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదం కేసు ఉంది. ఈ ప్రమాదానికి కారణమైన తన కుమారుడు రహేల్‌ను తప్పించారని షకీల్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటన తర్వాత రహేల్ దుబాయ్‌కి పారిపోవడానికి షకీల్ సహకరించారని పోలీసులు నిర్ధారించారు. ఈ కేసులో షకీల్‌ను ఏ3 నిందితుడిగా చేర్చారు.

ఈ కేసులో మాజీ ఎమ్మెల్యే షకీల్ పరారీలో ఉన్నారని గతంలో హైదరాబాద్ పోలీసులు ప్రకటించారు. ఏడాదిన్నర కాలంగా షకీల్ రాష్ట్రం విడిచి దుబాయ్‌లోనే నివసిస్తున్నారు. తాజాగా, ఆయన తల్లి మరణించడంతో అంత్యక్రియల్లో పాల్గొనేందుకు షకీల్ ఇవాళ ఉదయం శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్నారు. ఆయన రాకపై సమాచారం అందుకున్న పోలీసులు అప్రమత్తమయ్యారు. శంషాబాద్ రాగానే అరెస్టు చేశారు. అయితే మానవతా దృక్పథంతో తల్లి అంత్యక్రియల్లో పాల్గొనేందుకు పోలీసులు షకీల్‌కు అనుమతి ఇచ్చారని తెలుస్తోంది. ప్రస్తుతం పోలీసులు ఆయనను బోధన్‌కు తీసుకువెళ్తున్నట్లు సమాచారం.

**కేసు వివరాలు ఇవే..**

డిసెంబర్ 23, 2023న తెల్లవారుజామున షకీల్ కుమార్ రహేల్ అతి వేగంగా కారు నడుపుతూ ప్రజాభవన్ ఎదుట ఉన్న బారికేడ్లను ఢీకొట్టాడు. ప్రమాదం జరిగిన సమయంలో కారులో ఇద్దరు యువకులు, ముగ్గురు యువతులు ఉన్నారు. ఈ ఘటనలో బారికేడ్లు ధ్వంసం కాగా.. కారు ముందు భాగం కూడా తీవ్రంగా దెబ్బతింది. ప్రమాదం తర్వాత రహేల్ అక్కడి నుంచి పారిపోయాడు. పంజాగుట్ట పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేశారు. సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా రహేల్ కారు నడుపుతున్నట్లు గుర్తించారు.

# ఒక్కొక్కరికి ఒక్కో బ్రాండ్ ఉంటుంది.. నా బ్రాండ్ ఇదే

మొదటిపేజి తరువాయి

వర్సిటీలన్నీ కూడా నెహ్రూ స్థాపించినవేనన్నారు.

“యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ ప్రతీ పోలీస్ సిబ్బందికి ఇది అత్యంత ముఖ్యమైనది. ఎన్నికల మేనిఫెస్టోలోనే పోలీస్ స్కూల్ అంశాన్ని పొందుపరిచాం. ఆనాడు పండిట్ జవహర్ నెహ్రూ సారథ్యంలో దేశంలో యూనివర్సిటీల పునాదులు పడ్డాయి. నెహ్రూ దార్శనికతతోనే మన దేశం ప్రపంచ దేశాలతో పోటీ పడే స్థాయికి చేరింది. దేశ చరిత్రలో ఎంతో మంది ప్రధానులు, ముఖ్యమంత్రులు అయ్యారు.. కానీ అందులో కొద్ది మంది మాత్రమే చరిత్రలో గుర్తుండిపోయారు. ఆ కొద్దిమంది తీసుకున్న నిర్ణయాలు చరిత్రను మలుపు తిప్పాయి” అని వ్యాఖ్యానించారు.

“ముఖ్యమంత్రుల్లో ఒక్కొక్కరికి ఒక్కో బ్రాండ్ ఉందని చెప్పుకుంటున్నారు. రూ.2 కిలో బియ్యంతో ఎన్టీఆర్ ప్రతీ పేదవాడి మనసులో స్థానంసంపాదించుకున్నారు. హైదరాబాద్ లో ఐటీని అభివృద్ధి చేసి చంద్రబాబు నాయుడు ఒక బ్రాండ్ క్రియేట్ చేసుకున్నారు. రైతు బాంధవుడిగా ప్రజలు వైఎస్ ను గుర్తుంచుకుంటారు. అలాగే ఇవాళ నేను క్రియేట్ చేసిన నా బ్రాండ్ “యంగ్ ఇండియా”. మహాత్ముడి స్ఫూర్తితో యంగ్ ఇండియా బ్రాండ్ ను తెలంగాణలో క్రియేట్ చేసుకున్నాం. దేశ భవిష్యత్ తరగతి గదుల్లోనే ఉంది. అందుకే ఎడ్యుకేషన్, ఎంప్లాయిమెంట్ అనేది మా బ్రాండ్. నిరుద్యోగుల్లో సాంకేతిక నైపుణ్యంలో శిక్షణ అందించేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేసుకున్నాం” అని తెలిపారు.

“ఆనంద్ మహేంద్రను యూనివర్సిటీకి చైర్ పర్సన్ గా నియమించుకున్నాం. ఇవాళ యూనివర్సిటీలో చేరిన ప్రతీ విద్యార్థికి ఉద్యోగ భద్రత ఉంది. దేశంలోనే ది బెస్ట్ యూనివర్సిటీగా యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని తీర్చిదిద్దేందుకు ప్రయత్నిస్తున్నాం. వచ్చే ఒలంపిక్స్ లక్ష్యంగా యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ, అకాడమీని ఏర్పాటు చేసుకోబోతున్నాం. ప్రతీ నియోజకవర్గంలో 25 ఎకరాల విస్తీర్ణంలో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తున్నాం. ప్రాథమిక స్థాయిలోనే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్చుకోకపోవడంతో విద్యార్థుల సంఖ్య తగ్గుతుతోంది” అని ఆవేదన వ్యక్తం చేశారు.

“ఒకటో తరగతి నుంచి ఉన్న ప్రభుత్వ స్కూల్స్ విధానంలో మార్పులు తీసుకొచ్చి... ప్రీస్కూల్ విధానాన్ని తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. సైనిక్ స్కూల్ కు ధీటుగా పోలీస్ స్కూల్ ను తీర్చి దిద్దాలి. ఇందుకు కావాల్సిన నిధులు ప్రభుత్వం ఇవ్వడానికి సిద్ధంగా ఉంది. పోలీస్ స్కూల్ ను ఆదర్శంగా తీర్చిదిద్దడం మనందరి బాధ్యత. సామాజిక బాధ్యతగా ప్రైవేటు కంపెనీలు పోలీస్ స్కూల్ కు ఆర్థిక సాయం అందించాలి. పోలీస్ స్కూల్ కోసం రూ. 100 కోట్ల కార్పస్ ఫండ్ క్రియేట్ చేసుకోవాలి. ఇందుకు అవసరమైన అనుమతులు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది” అని వ్యాఖ్యానించారు.



# కాంగ్రెస్ అంటేనే కరప్షన్ అని మరోసారి రుజువైంది..

**డీఎస్సీ స్పోర్ట్స్ కోటాలో అవినీతిపై మండిపడ్డ రాకేశ్ రెడ్డి**

**హైదరాబాద్ ఏప్రిల్ 10(ప్రజాస్వరం):**



డీఎస్సీ స్పోర్ట్స్ కోటాలో అవినీతి జరిగిందని ఆధారాలను సైతం సేకరించి అభ్యర్థులు ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని బీఆర్ఎస్ నేత ఏనుగుల రాకేశ్ రెడ్డి మండిపడ్డారు. రిజర్వేషన్ క్యాటగిరీల్లో మొదట 33 మందిని భర్తీ చేసినప్పుడు జాతీయ స్థాయి క్రీడల్లో రాణించిన అనేక మంది అభ్యర్థులను కాదని ఎటువంటి ప్రతిభ చూపకుండా దొంగ సర్టిఫికెట్లు పెట్టినటువంటి వాళ్లకు ఉద్యోగాలు ఇచ్చారని ఆరోపించారు. పెద్దఎత్తున డబ్బులు చేతులు మారాయని ఆరోపణలు వచ్చినా, ఫిర్యాదులు చేసినా మూడు సార్లు సర్టిఫికెట్లు పరిశీలించి కూడా ఇప్పటికీ ఆ నివేదికను ప్రభుత్వం బయట పెట్టడం లేదని విమర్శించారు.

ఓపెన్ క్యాటగిరీలో ఉన్న 63 మందిని ఎప్పుడు భర్తీ చేస్తారని ప్రతి రోజు అభ్యర్థులు ప్రభుత్వ ఆఫీసుల చుట్టూ చెప్పులు అరిగేలా ప్రదక్షిణాలు చేస్తున్నా కనీసం సమాధానం చెప్పేటోడే లేడని ఏనుగుల రాకేశ్ రెడ్డి మండిపడ్డారు. ఒకవైపు గ్రూప్ 1 ఫలితాల్లో గోల్ మాల్ మరోవైపు డీఎస్సీ స్పోర్ట్స్ కోటాలో అవినీతి.. ఏంది ఈ ఘోరమని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్ల దగ్గర 20 పర్సంటేజ్, పెన్షనర్ల దగ్గర పర్సంటేజ్, పర్మిషన్ కి పెమెంట్స్, పథకాల వర్తింపు కోసం పైసలు, ఉద్యోగాల భర్తీలో డబ్బులు చేతులు మారడం... ఇలా కాంగ్రెస్ అంటేనే కరప్షన్ అని మరోసారి రుజువు చేసుకున్నారని అన్నారు. ప్రభుత్వం వెంటనే డీఎస్సీ స్పోర్ట్స్ కోటాపై విచారణ చేపట్టి వాస్తవాలను తేల్చాలని అన్నారు. స్పోర్ట్స్ కోటా ఉద్యోగాల్ని తక్షణమే భర్తీ చేయాలని.. స్పోర్ట్స్ కోటా అభ్యర్థులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

# బీహెచ్ఈఎల్‌లో క్రికెట్ బెట్టింగ్ ముఠా గుట్టు రట్టు...

- మాదాపూర్ ఎస్ఓటీ బృందం బెట్టింగ్ నిర్వహిస్తున్న ఇంటిపై దాడి
- 6 ఎకౌంట్స్ సీజ్
- 2.55 లక్షలు ఫ్రీజ్

**హైదరాబాద్ ఏప్రిల్ 10(ప్రజాస్వరం):**



క్రికెట్ బెట్టింగ్ పై అధికారులు ఉక్కుపాదం మోపుతున్నప్పటికీ అడ్డుకట్ట పడడం లేదు. తాజాగా బీహెచ్ఈఎల్‌లో క్రికెట్ బెట్టింగ్ ముఠా గుట్టు రట్టయ్యింది. ఓ ఇంట్లో గుట్టుచప్పుడు కాకుండా క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తోంది ఓ ముఠా. వాట్సప్ కాల్స్ ఆధారంగా బెట్టింగ్ నిర్వహిస్తున్నారు. సమాచారం అందుకున్న మాదాపూర్ ఎస్ఓటీ బృందం బెట్టింగ్ నిర్వహిస్తున్న ఇంటిపై దాడి చేసింది. పఠాన్ చెరువుకు చెందిన చిరంజీవి, కృష్ణను రెడ్ హ్యాండెడ్‌గా ఎస్ఓటీ టీం పట్టుకుంది. ఆర్గనైజర్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. 6 ఎకౌంట్స్ సీజ్ చేసి అందులో ఉన్న 2.55 లక్షలు ఫ్రీజ్ చేశారు అధికారులు. కేటుగాళ్లు ఇతర రాష్ట్రాలలో క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు గుర్తించారు.

దానికి మధ్యవర్తి వహిస్తూ హైదరాబాద్ లో బెట్టింగ్ నిర్వహిస్తున్నారు ముఠా సభ్యులు. వాట్సాప్ కాల్స్ చేసి సమాచారం ఇస్తోంది ముఠా. ఎకౌంట్స్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేస్తే పట్టుబడుతామని.. నేరుగా క్యాష్ కలెక్ట్ చేస్తున్నారు నిర్వాహకులు. గెలిస్తే నేరుగా క్యాష్ తీసుకొని బెట్టింగ్ ముఠా వారికి అందజేస్తోంది. బెట్టింగ్ వ్యవహారంపై లోతుగా దర్యాప్తు చేస్తోంది ఎస్ఓటీ టీమ్. బెట్టింగ్ లో ముఖ్యమైన వ్యక్తులను పట్టుకునేందుకు పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.



# హెచ్‌సీయూకు సెంట్రల్ ఎంపవర్ కమిటీ

## నేడు కంచ గచ్చిబౌలి భూముల పరిశీలన

**హైదరాబాద్ ఏప్రిల్ 10(ప్రజాస్వరం):**

కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూమిని పరిశీలించేందుకు హెచ్‌సీయూకు పర్యావరణ, అటవీ శాఖల కేంద్ర సాధికారిక కమిటీ వచ్చింది. క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి పూర్తి వివరాలను సుప్రీంకోర్టుకు అందజేయనుంది. టీజీఐఐసీ ఈ భూముల చదును చేపట్టిన నేపథ్యంలో.. సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. దీనిపై క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి నివేదిక అందజేయాలని కమిటీకి సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో సెంట్రల్ ఎంపవర్ కమిటీ ఛైర్మన్ సిద్ధాంత దాస్, మరో ఇద్దరు సభ్యులు హైదరాబాద్‌కు చేరుకున్నారు. వీరు నేడు,రేపు కంచ గచ్చిబౌలి భూముల్లో పరిశీలన జరిపి.. వాస్తవ పరిస్థితులను అధ్యయనం చేయనున్నారు.

# గ్రామ స్థాయి నుంచి పార్టీ బలోపేతమే రాహుల్ లక్ష్యం

- గ్రామీణ స్థాయి నుంచి బూత్ కమిటీల వరకు పార్టీ బలోపేతానికి రాహుల్ ప్రాధాన్యం
- కుల గణన సర్వేకు కాంగ్రెస్ మద్దతు – సమాన వనరుల పంపిణీ లక్ష్యంగా నిర్ణయం
- జిల్లా అధ్యక్షులు విధాన నిర్ణయాల్లో కీలకపాత్రలో ఉండాలని ఏఐసీసీ నిర్ణయం

**హైదరాబాద్ ఏప్రిల్ 10(ప్రజాస్వరం):**

కాంగ్రెస్ పార్టీ మద్దతుదారుల సమక్షంలో రాహుల్ గాంధీ పార్టీ నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడించారు. అట్టడుగు వర్గాలు స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలని ఆయన సంకల్పించారని తెలిపారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో బుధవారం జరిగిన ఏఐసీసీ సమావేశానికి సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, సీతక్క, జూపల్లి కృష్ణారావు, తుమ్మల నాగేశ్వర్ రావు, మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ గౌడ్ తదితరులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా భట్టి మీడియాతో మాట్లాడుతూ, రాహుల్ గాంధీ తెలంగాణ కుల గణన అంశాన్ని ప్రస్తావించడాన్ని హర్షించారు. దేశంలోని సంపదను అందరితో సమంగా పంచుకోవాలన్నదే కాంగ్రెస్ సిద్ధాంతమని చెప్పారు. దండి సత్యాగ్రహం స్ఫూర్తితో కాంగ్రెస్ ముందుకు సాగుతోందని, సబర్మతి ఒడ్డునుంచి మరోసారి న్యాయ్ పథ్ ద్వారా దేశానికి నూతన సందేశం ఇచ్చేందుకు ఈ ప్లీనరీ సమావేశం ఉపయోగపడిందన్నారు.

కుల గణన సర్వే లాంటి చర్యల ద్వారా వనరులు, అవకాశాలను అందరికీ అందించాలన్న సంకల్పాన్ని కాంగ్రెస్ చూపించిందని పేర్కొన్నారు. రాహుల్ గాంధీ ప్రారంభం నుంచి పార్టీ నిర్మాణంపై స్పష్టమైన ఆలోచనతో ఉన్నారని, గ్రామ స్థాయి బూత్ కమిటీల నుండి జిల్లా స్థాయి కాంగ్రెస్ నాయకత్వం వరకు సమగ్రంగా పునర్నిర్మాణం జరగాలని నిర్ణయించినట్టు తెలిపారు. జిల్లా అధ్యక్షులే తమ పరిధిలో జరిగే ప్రతి కార్యాచరణకు నాయకత్వం వహించాలని, త్వరలోనే ఈ విధానాన్ని అమలు చేయబోతున్నామని భట్టి స్పష్టం చేశారు.

# హరీశ్‌రావుది వన్‌సైడ్ లవ్.. ఆయనకు ప్రేమ లేదు

- కేసీఆర్‌కు హరీశ్ రావు మీద ప్రేమ లేదు
- కానీ హరీశ్ రావుకు కేసీఆర్‌పై ప్రేమ ఉంది..
- ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి హరీశ్ రావుపై తీవ్ర విమర్శలు
- మీరు పడగొట్టిన రాష్ట్రాన్ని రేవంత్ రెడ్డి నిలబెట్టిండు
- తెలంగాణలో మీకుటుంబమే నిలబడింది

**హైదరాబాద్ ఏప్రిల్ 10(ప్రజాస్వరం):**


ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి బీఆర్ఎస్ పై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఎంపీ చామల మాట్లాడుతూ.. “మీరు పడగొట్టిన రాష్ట్రాన్ని రేవంత్ రెడ్డి నిలబెట్టిండు.. తెలంగాణలో మీకుటుంబమే నిలబడింది.. బీఆర్ఎస్ పార్టీలో హరీష్ పరిస్థితి ఏంటో ఆయనకే తెలియదు.. మామకు వారసుడు అని పగటి కలలు కంటుండు.. బీఆర్ఎస్ సిల్వర్ జూబ్లీ మీటింగ్ సందర్భంగా నిన్న రాష్ట్ర వ్యాప్తంగా పెట్టిన పోస్టర్లలో హరీష్ రావు ఫోటో లేదు.. 2009 లోనే హరీష్‌రావు కన్నకల చెదిరిపోయింది..

బామ్మర్ది కేటీఆర్ వచ్చాక హరీష్ రావు పరిస్థితి పార్టీలో అగమ్యగోచరంగా తయారైంది.. రాష్ట్రంలో బూతు పితమహులు కేసీఆర్.. కళ్ళు ఉండి చూడలేని, చెవులు ఉండి కూడా వినలేని కబోది హరీష్ రావు.. కాంగ్రెస్ లో బీసీ పీసీసీ అధ్యక్షుడుగా ఉన్నాడు.. బీఆర్ఎస్ లో బీసీని ప్రెసిడెంట్ గా గాని కనీసం వర్కింగ్ పోస్ట్ అయినా ఇవ్వగలరా? బీఆర్ఎస్ సిల్వర్ జూబ్లీ సందర్భంగానైనా బీసీని పార్టీ అధ్యక్షుడుని చేయాలి అని” సవాల్ విసిరారు.

# తుమ్మితే ఊడిపోయే ముక్కులాంటివి కాంగ్రెస్ ప్రభుత్వాలు

- తెలంగాణలో ఆ పార్టీ నుంచి రేవంత్ రెడ్డే చివరి సీఎం
- బీజేపీ ఎంపీ లక్ష్మణ్ సెటైర్

**హైదరాబాద్ ఏప్రిల్ 10(ప్రజాస్వరం):**



దేశవ్యాప్తంగా తెలంగాణ, కర్ణాటక, హిమాచల్ ప్రదేశ్ లలో కాంగ్రెస్ అధికారంలో ఉందని.. ఆ మూడు రాష్ట్రాల్లోని ప్రభుత్వాల పరిస్థితి తుమ్మితే ఊడిపోయే ముక్కులాగే ఉందని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ విమర్శించారు. నిజాం పాలనలో రజాకార్లను తరిమికొట్టినట్లు దేశం నుంచి కాంగ్రెస్ ను తరిమికొట్టడం ఖాయమని ఆయన చెప్పారు. తెలంగాణలో కాంగ్రెస్ మరోమారు అధికారంలోకి రావడం అసాధ్యమని, ఆ పార్టీ నుంచి రేవంత్ రెడ్డే చివరి ముఖ్యమంత్రి అని అన్నారు. రేవంత్ రెడ్డిలో అసహనం, అభద్రత కనిపిస్తోందని, ఆ ఆందోళనతోనే రాహుల్ గాంధీ మెప్పు కోసం బీజేపీపై అడ్డగోలుగా విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు.

# వడగండ్ల వానలకు నష్టపోయిన రైతులను అదుకోవాలి..

మొదటిపేజి తరువాయి



ప్రభుత్వాన్ని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు సిద్ధిపేట జిల్లా కలెక్టర్, వ్యవసాయ అధికారులతో హరీశ్‌రావు ఫోన్‌లో మాట్లాడారు. వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటన చేసి, పంట నష్టం అంచనా వేసి, నష్టపోయిన రైతుల జాబితాను సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదిక పంపాలని సూచించారు. ఆందోళనలో ఉన్న అన్నదాతలను అదుకోవాలని చెప్పారు. రైతులు ధైర్యంగా ఉండాలని అధైర్య పడొద్దని, ఆందోళన చెందొద్దని అన్నారు.



## సీపీఆర్ చేసి ప్రాణాన్ని కాపాడిన కానిస్టేబుల్

### అభినందించిన జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి

**మెదక్, ఏప్రిల్ 10 (ప్రజా స్వరం) :**

మెదక్ జిల్లా శివంపేట మండలం దేవయ్యగూడెం తండాలో లున్సవత్ రాజు అనే వ్యక్తి మద్యం సేవించి గొడవ చేస్తున్నాడని 100 డయల్ రాగా బ్లూ కోల్ట్స్ డ్యూటీ లో ఉన్న కానిస్టేబుళ్ళు విష్ణు వర్ధన్ రెడ్డి, మహేందర్ ఇద్దరు అక్కడికి వెళ్లేసరికి రాజు రూమ్ లోకి వెళ్లి తలుపులు వేసుకొని ఉన్నాడు. తలుపులు పగలగొట్టి లోపలికి వెళ్లగా అప్పటికే రాజు ఉరివేసుకొని ఉన్నాడు. అతనిని కిందకుదించి కానిస్టేబుల్ విష్ణువర్ధన్ రెడ్డి సీపీఆర్ చేసి తండాకు చెందిన వారి కారులో నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకు వెళ్లగా ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స గురించి సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకు వెళ్ళినారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్నాడు. బ్లూ కొల్ట్స్ డ్యూటీ లో ఉన్న విష్ణు వర్ధన్ రెడ్డి, మహేందర్ త్వరగా స్పందించి ప్రాణాన్ని కాపాడినందుకు జిల్లా ఎస్పీ అభిందించారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

**మెదక్ ఏప్రిల్ 10 (ప్రజా స్వరం) :**

మెదక్ మండలం బాలనగర్ గ్రామం మత్తడిలో ఈత కోసం వెళ్లి తుడుం నవీన్ తుడుం అనిల్ ప్రమాదవశాత్తు ఇటీవల మరణించడం జరిగింది. ఈ విషయం తెలుసుకున్న బీజేపీ మెదక్ మండల అధ్యక్షురాలు బెండ వీణ వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా వారి కుటుంబానికి భరోసా కల్పించి ఆర్థిక సాయాన్ని అందజేశారు.



## కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఆర్డీవో



**మెదక్, ఏప్రిల్ 10 (ప్రజా స్వరం) :**

పీఎస్సిఎస్ పరిధిలోని మెదక్ మండలం శివాయిపల్లి గ్రామం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆర్డీవో రమాదేవి సంబంధిత అధికారులు కలిసి ప్రారంభించారు. ఆర్డిఓ రమాదేవి స్వయంగా ధాన్యాన్ని శుభ్రం చేసే యంత్రంలో వేసి శుభ్రపరిచారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు కొనుగోలు కేంద్రానికి నాణ్యమైన ధాన్యం తీసుకురావాలని సూచించారు. నియోజకవర్గంలో ప్రతి రైతుకు అందుబాటులో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. చివరి గింజ వరకు కొంటామని అన్నారు. దళారులను నమ్మి మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలోనే ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. అలాగే సన్న రకం వరి పండించిన రైతులకు 500/ బొనస్ ఇస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక ఇబ్బందులతో యువకుడు ఆత్మహత్య

**మెదక్, ఏప్రిల్ 10 (ప్రజా స్వరం) :**

ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపం చెందిన యువకుడు ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం జరిగింది. పోలీసుల కథనం మేరకు మెదక్ పట్టణంలోని ఔరంగాబాద్ కు చెందిన ఆడేపు ధనరాజ్ (25) గత కొంత కాలంగా ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారు. తల్లిదండ్రులు బాధువుల ఇంటికి వెళ్ళడం తో ఇంట్లో ఒంటరిగా ఉన్నాడు. దీనితో ఆర్థిక ఇబ్బందులకు మనస్తాపం చెందిన యువకుడు ఇంట్లో దూలానికి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయం ఇంటికి వచ్చిన కుటుంబీకులకు దూలానికి వేలాడుతున్న మృతదేహం కనిపించింది. కిందికి దించి చూడగా అప్పటికే మృతి చెంది



ఉన్నాడు. విషయం తెలుసుకున్న హవేలీ ఘనపూర్ ఎస్ఐ సత్యనారాయణ ఘటన స్థలానికి చేరుకొని పోస్టుమార్టం కోసం మెదక్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్యతో పాటు నాలుగు నెలల కుమారుడు ఉన్నాడు.

# ధాన్యం తూకంలో పారదర్శకంగా ఉండాలి

### చివరి గింజ వరకు మద్దతు ధరకు కొనుగోలు

### వరి కోతల ప్రకారం సకాలంలో ధాన్యం కొనుగోలు ప్రారంభం

### మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

### టూర్పాల్ మిషన్‌లో వడ్లు పోసి ధాన్యాన్ని శుభ్రం చేసిన కలెక్టర్







**మెదక్, ఏప్రిల్ 10 (ప్రజా స్వరం) :**

రైతులు కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ప్యాడి క్లీనర్ ద్వారా ధాన్యాన్ని పరిశుభ్రం చేసి విక్రయించి మద్దతు ధర పొందాలని కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. గురువారం మెదక్ మండలం పాతూరు ఐకెపి కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ రాహుల్ రాజ్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తాము పండించిన ధాన్యాన్ని ప్యాడి క్లీనర్ ద్వారా పరిశుభ్రం చేసి ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలని మద్దతు ధర పొందాలని సూచించారు. దళారులకు అడ్డుకట్ట వేసేందుకు, రైతులకు మద్దతు ధర అందించేందుకు ఈసారి ముందుగానే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామని వెల్లడించారు. జిల్లాలో రబీ సీజన్ కు గాను 480 కొనుగోలు కేంద్రాల ద్వారా వడ్లను కొనుగోలు చేయడం జరుగుతుందని ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ప్యాడి క్లీనర్స్ అందుబాటులో ఉంచామని రైతులు తమ ధాన్యాన్ని తాలు, తప్ప లేకుండా, ప్యాడి క్లీనర్ల ద్వారా శుభ్రపరచుకుని తేమ శాతం 17 ఉండేలా చూసుకుని విక్రయించిన ఎడల మద్దతు ధర లభిస్తుందని సూచించారు. తక్కువ టైంలోనే ధాన్యం డాడీ క్లీనర్స్ ద్వారా శుభ్రం చేయవచ్చని క్షేత్ర స్థాయిలో స్వయంగా తెలుసుకోవడం జరిగిందని రైతులు ఇట్టి విషయాన్ని కొనుగోలు కేంద్రాల్లో తప్పనిసరిగా ధాన్యాన్ని శుభ్రపరుచుకోవాలన్నారు. ప్రభుత్వం గ్రేడ్ ఏ రకం ధాన్యానికి క్వింటాలుకు 2320 సాధారణ రకానికి 2300 నిర్ణయించినందని అన్నారు. జిల్లాలోని రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని, దళారులకు ధాన్యం విక్రయించవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, డిఆర్డిఓ పిడి శ్రీనివాసరావు, తాసిల్దార్ లక్ష్మణ్ బాబు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ పేదల ప్రభుత్వం

### ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్

**మెదక్, ఏప్రిల్ 10 (ప్రజా స్వరం) :**

పేద వారు సంతోషంగా కడుపు నిండా భోజనం చేయాలనే ఉద్దేశంతో సన్న బియ్యం పంపిణీ చేస్తున్నట్లు ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ పేర్కొన్నారు. గురువారం మెదక్ మండలం బాలనగర్ ప్రాంతంలో 33/11 కె.వి సబ్ స్టేషన్ ను ఆయన ప్రారంభోత్సవం చేశారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇటీవల ప్రారంభించిన సన్న బియ్యం లబ్ధిదారుడు కట్రోత్ శివ ఇంట్లో గురువారం సహ సహపంతి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రవేశ పెట్టిన సన్న బియ్యం పథకం దేశంలోని ఎక్కడలేని విధంగా మన రాష్ట్రంలో మొదటి సారిగా ప్రారంభించారన్నారు. పేద, ధనిక అనే బేధాలు లేకుండా అందరికీ ఒకే రకమైన ఆహారం అందించేందుకు ప్రభుత్వం కృషి చేసిందన్నారు. మా ప్రభుత్వం పేదల ప్రభుత్వంని పేదల కోసం పరితపించే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదలకు సన్న బియ్యం ఇవ్వాలని ఉద్దేశ్యంతో వున్నారని తెలిపారు. అనంతరం గ్రామంలోని తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజల అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తుందన్నారు. అందులో భాగంగానే ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టింది అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు నాణ్యమైన భోజనం అందించాలనే ఉద్దేశంతో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం ప్రవేశపెట్టిందన్నారు. భవిష్యత్ లో విద్య, వైద్యం రంగాలను మరింత అభివృద్ధి చేసుకుంటూ ముందు కెళతామన్నారు. నిరంతర విద్యుత్ సరఫరా అందించడం ధ్యేయంగా పటిష్ట ప్రణాళిక ద్వారా ముందుకు పోతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎస్ సీ శంకర్, తహశీల్దార్ లక్ష్మణ్ బాబు పాల్గొన్నారు.





## పౌష్టికాహారం తప్పనిసరి

### రాయపోల్ సూపర్వైజర్ షబానా

**దౌల్తాబాద్ ఏప్రిల్10 (ప్రజాస్వరం) :**

రాబోయేతరం ఆరోగ్యవంతంగా ఉండాలంటే పౌష్టికాహారం అందించాలని పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యమని, గర్భిణీ స్త్రీలు, బాలింతలు, పిల్లలకు తప్పనిసరి పౌష్టికాహారం అందించాలని ఐసిడిఎస్ సూపర్వైజర్ షబానా అన్నారు. గురువారం రాయపోల్ మండలం రామారం అంగన్వాడి కేంద్రంలో పోషణ్ పక్వాడ్ లో భాగంగా చేతుల పరిశుభ్రత, రక్తహీనత అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా ఆహారపు అలవాట్లలో మార్పులు వస్తున్నాయని, సంపూర్ణ ఆరోగ్యంతో పాటు చిన్నారులకు ఆహారం, ఆట, పాటలు, ప్రేమతో విద్యనందించే అంగన్వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే చిన్నారులు పాఠశాలలకు భయం లేకుండా వెళ్లడానికి చదవడం, రాయడం, జ్ఞాపకశక్తితో పాటు మెదడు అభివృద్ధి చెందాలంటే అంగన్వాడీ కేంద్రాల్లో విద్యతోపాటు బొమ్మలు వేయించడం, మాట్లాడించడం, ఆహారపు అలవాట్లలో భాగంగా చిరుధాన్యాలు, ఆకుకూరలతో కూడిన ఆహారాన్ని అంగన్వాడీ కేంద్రాలలో అందిస్తామన్నారు. అంగన్వాడీ కేంద్రాలలో అంగన్వాడీ పోషణ పక్వాడ్ ప్రోగ్రాం కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. రక్తహీనత తగ్గించేందుకు గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు ఆకుకూరలతో పాటు చిరుధాన్యాలను అందిస్తామని, రాగులు, జొన్నలు, పెసర్లు, సజ్జలు, బబ్బర్లు, ఉలువలు, పప్పులు మొదలగు వాటిని ఆహారంగా అందిస్తామని తెలిపారు. చేతి పరిశుభ్రత వలన కలిగే లాభాలు అపరిశుభ్రత వల్ల కలిగే సమస్యల పై అవగాహన కల్పించారు. మనం ప్రతిరోజూ తినే ఆహార పదార్థాలను చేతుల ద్వారానే తీసుకుంటామని అలాంటి చేతులు అపరిశుభ్రంగా ఉంటే అనేక కంటికి కనపడని సూక్ష్మజవులు క్రిములు చేతులపై ఉంటాయని, మనలాగే చేతులను శుభ్రం చేసుకోకుండా ఆహారాన్ని తీసుకుంటే అనారోగ్యానికి గురవుతున్నారు. తప్పనిసరిగా మలవిసర్జనకు తర్వాత భోజనానికి ముందు చేతులను సబ్బుతో శుభ్రపరచుకోవడాన్ని ప్రత్యేకంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు పున్నమ్మ , సరస్వతి, ఆయా రేణుక పాల్గొన్నారు.

## ఆత్మీయ అభినందన సభ ను విజయవంతం చేయండి

### బీజేపీ జిల్లా అధ్యక్షుడు మల్లేష్ గౌడ్

**మెదక్, ఏప్రిల్ 10 (ప్రజా స్వరం) :**

మెదక్ జిల్లా కేంద్రం బిజెపి కార్యాలయంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వాల్దస్ మల్లేష్ గౌడ్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్సీ చిన్న మైల్ అంజి రెడ్డి, మల్కా కొమురయ్య ఆత్మీయ అభినందన సభ శుక్రవారం మెదక్ జిల్లా కేంద్రం సాయి బాలాజీ గార్డెన్స్ లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఆత్మీయ అభినందన సభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు విచ్చేస్తున్న అన్నారు. ఈ సందర్భంగా బూత్ అధ్యక్షులు శక్తి కేంద్ర ఇన్చార్జులు, మండల స్థాయి నాయకులు, మండల అధ్యక్షులు జిల్లా స్థాయి నాయకులు, ముఖ్య కార్యకర్తలు అందరూ భారీ సంఖ్యలో తరలివచ్చి ఈ ఆత్మీయ అభినందన సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్, ఎమ్ ఎల్ ఎన్ రెడ్డి, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు గడ్డం కాశీనాథ్, పట్టణ అధ్యక్షులు నాయిని ప్రసాద్, జిల్లా నాయకులు రాజేందర్, ఓబీసీ మోర్చా శివ, మాజీ మండల



అధ్యక్షుడు ఆకుల ప్రభాకర్, రంజిత్ రెడ్డి, శంకర్ గౌడ్, మండల నాయకులు నరేష్, భాగేష్, వెంకట్, నర్సింలు, మల్లేష్, సాయిబాబా, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక
రంగారెడ్డి, మేడ్చల్, వికారాబాద్





# మందులు అందుబాటులో ఉంచాలి

## జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**వికారాబాద్, ఏప్రిల్ 10 (ప్రజాస్వరం):**

గర్భవతులకు అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ వైద్య అధికారికి సూచించారు. గురువారం దారూర్ మండలం, నాగసముందర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ గావించారు. ఆసుపత్రిలో గర్భిణీ స్త్రీల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పరీక్షలు నిర్వహించాలని అదేవిధంగా వారికి కావాల్సిన ఐరన్, క్యాల్షియం, విటమిన్ మందులను అందిస్తూ వాటిని తప్పనిసరి వాడే విధంగా వారిలో అవగాహన కల్పించాలని కలెక్టర్ వైద్య అధికారి డాక్టర్ మాధవిలతకు సూచించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో కావలసిన అవసరాలపై ఆరా తీశారు. ఆసుపత్రిలో అవసరాలకు అనుగుణంగా ఏర్పాటు చేసుకునేందుకు ఫ్యాన్లు అందజేస్తామని కలెక్టర్ తెలిపారు. ఆసుపత్రికి వచ్చిన పేషెంట్లను ఆసుపత్రిలో అందిస్తున్న సేవలపై కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.

# కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు



**వికారాబాద్, ఏప్రిల్ 11 (ప్రజా స్వరం):**

వికారాబాద్ తహసిల్దార్ కార్యాలయంలో విద్యుత్తు మరమ్మత్తులతో పాటు ప్రహరీ గోడ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులకు సూచించారు. గురువారం తహసిల్దార్ కార్యాలయాన్ని, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసారు. తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ఫైల్స్, రికార్డు గదిని కలెక్టర్ పరిశీలించారు. పహానీల స్కానింగ్ ప్రక్రియ పూర్తి చేశారా అని అడిగి తెలుసుకున్నారు. కార్యాలయంలో నిరుపయోగంగా ఉన్న ఫర్నిచర్ ఇతర సామాగ్రిని తొలగించవలసిందిగా తహసిల్దార్ కు కలెక్టర్ సూచించారు. కార్యాలయంలో అవసరాల మేరకు ఫ్యాన్లు సమకూర్చుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా తాసిల్దార్ కార్యాలయ ఆవరణలో దివ్యాంగుల ఉపాధి నిమిత్తం ఏర్పాటుచేసిన స్టాల్ ను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో నిర్వహించే సదరం క్యాంప్ ను కలెక్టర్ పరిశీలించి కావలసిన సౌకర్యాలను సమకూర్చుకోవాలని డిఆర్డిఓ శ్రీనివాసు కు కలెక్టర్ సూచించారు. ఆకస్మిక తనిఖీల్లో భాగంగా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, ఆర్డిఓ వాసు చంద్ర, తహసిల్దార్ లక్ష్మీనారాయణ లు ఉన్నారు.

# సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలి

## జిల్లా ఎస్పీ కె. నారాయణ రెడ్డి



**వికారాబాద్, ఏప్రిల్ 10 (ప్రజాస్వరం):**

జిల్లా ఎస్పీ కె. నారాయణ రెడ్డి జిల్లా పోలీస్ అధికారులతో సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో జిల్లాలో నమోదైన ముఖ్యమైన కేసుల పురోగతి, విచారణ స్థితి, న్యాయపరమైన అంశాలు, నేరాల నివారణ చర్యలపై విస్తృతంగా చర్చ జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నేరాలపై కఠిన చర్యలు తీసుకోవడమే కాకుండా, న్యాయస్థానాలలో దృఢమైన సాక్ష్యాధారాలను సమర్పించడం ద్వారా కేసులలో కన్విక్షన్(శిక్ష) శాతాన్ని పెంచాల్సిన అవసరం ఉంది అని అన్నారు. ప్రతి కేసును ప్రాధాన్యతతో పరిశీలించి, ఛార్జ్‌షీట్లను సకాలంలో దాఖలు చేయాలి. అలాగే, సాంకేతిక ఆధారాలను సమకూర్చడం, ఫోరెన్సిక్ సహాయాన్ని వినియోగించడం, ప్రత్యక్ష సాక్షులను సమర్థవంతంగా న్యాయస్థానాలలో ప్రవేశపెట్టే విధంగా చర్యలు తీసుకోవాలి అని తెలిపారు. అలాగే, దొంగతనాల కేసులను త్వరితగతిన ఛేదించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, జిల్లాలో దొంగతనాలు మరియు ఇతర నేరాలు జరగకుండా నిరోధించేందుకు సీసీటీవీల ఏర్పాటు ప్రాధాన్యతను ప్రజలకు అవగాహన చేయాలని అన్నారు. పెండింగ్‌లో ఉన్న కేసుల పై ప్రత్యేక దృష్టి పెట్టాలని, అలాగే సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ, సైబర్ క్రైమ్ పైన వచ్చిన ఫిర్యాదులపైన వెంటనే కేసులు నమోదు చేసి బాధితులకు న్యాయం చేయాలనీ పేర్కొన్నారు. ఈ సమీక్షా సమావేశంలో పరిగి, వికారాబాద్, తాండూరు, డీఎస్పీలు, ఇన్స్పెక్టర్లు, సర్కిల్ ఇన్స్పెక్టర్లు, తదితర అధికారులు పాల్గొన్నారు.

# రైతులకు ఇబ్బంది కలగనీయొద్దు

## అదనపు కలెక్టర్ లింగ్యానాయక్




**వికారాబాద్, ఏప్రిల్ 10(ప్రజాస్వరం):**

రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా 2024 25 రబి సీజన్ కు సంబంధించిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ అధికారులకు సూచించారు. గురు వారం కలెక్టరేట్ సమావేశ మందిరం నందు ఐ కె పి, పి ఎ సి ఎస్, మెప్మా, డి సి ఎం ఎస్, సి ఇ ఓ లు, ఎ పి ఎం లు, సిసి, ట్యాబ్ ఎంట్రీ ఆపరేటర్ లకు సన్నాహక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రబీ సీజన్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద చేపట్టాల్సిన ఏర్పాట్లపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు . ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ సి ఎం ఆర్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఈ నెల 15 నుండి ప్రారంభించేందుకు సిద్దంగా ఉండాలని, వరి కొనుగోళ్ళ పై రైతులకు పూర్తి అవగాహన కల్పించాలన్నారు. రబీ వరి కొనుగోలు ప్రణాళిక ప్రకారం ముందస్తు చర్యలు తీసుకోవాలని, మిల్లులకు తేమ లేకుండ నాణ్యమైన వరి ధాన్యాన్ని తరలించే విధంగా రైతులు కేంద్రాలకు తీసుకురావాలని అన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా చూసుకోవలసిన బాధ్యత మన అందరి పై ఉందని అన్నారు. జిల్లా లో 128 వరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని , 11 కేంద్రాలు సన్నాలు , 117 దొడ్డు రకాలు కొనుగోలు కు సిద్దంగా ఉండాలన్నారు. సుమారుగా ,90,000 మెట్రిక్ టన్నుల దొడ్డు రకం వరి ,10 ,000 మెట్రిక్ టన్నుల సన్న రకం వరి వస్తుందని ,ఏప్రిల్ చివరి వారము వరకు వరి ధాన్యం వచ్చే సూచనలు ఉన్నందున ముందస్తుగానే సెంటర్లు ఓపెన్ చేస్తున్నట్లు తెలిపారు. ఐ కే పి సెంటర్ల కు మొదటి ప్రాదాన్యత ఇవ్వడం జరిగితుందని, ప్రతి కొనుగోలు కేంద్రం దగ్గర ఫ్లెక్సీ ఏర్పాటు చేసి ధరలు, తేమశాతం తదితర వివరాలు ఏర్పాటు చేయాలన్నారు. కేంద్రం దగ్గర క్లీనింగ్ మిషన్, తేమ శాతం కొలిచే పరికరాలు, త్రాగునీరు ఇతర ఏర్పాట్లు చేయాలన్నారు. గన్ని బ్యాగులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. కొత్త గన్నిబ్యాగులు పాత గన్ని బ్యాగులు వేరు వేరుగా ఉంచాలి టార్పాలిన్లు, ప్యాడి క్లీనర్లు, తేమ యంత్రాలు , తూకం యంత్రాలు అందుబాటులో ఉంచాలని, రైతులు వారి ఆధార్ కార్డును నమోదు చేయాలన్నారు. చెక్ పోస్ట్ ల దగ్గర రెవిన్యూ, పోలీస్, సివిల్ సప్లై సిబ్బంది ని ఏర్పాటు చేయాలన్నారు. ప్రణాళిక ప్రకారం టోకెన్లు ఇచ్చి సెంటర్ లకు ధాన్యం వచ్చే విదంగా చూడాలని రైతులకు ఎలాంటి నష్టం కలుగకుండా వరి కొనుగోలు జరగాలని అధికారులకు సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించేందుకు సిద్ధం చేయాలన్నారు . గన్ని బ్యాగులు అందుబాటులో ఉన్నాయని, మిగతా బ్యాగులకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. రవాణా విషయంలో రైతులు నష్టపోకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. మిల్లర్లకు నిర్దేశించిన లక్ష్యాల మేరకు వరి అందజేయాలన్నారు. ఈ సమావేశంలో డి. యస్.ఓ మోహన్ బాబు , డి. యం. సివిల్ సప్లై వెంకటేశ్వర్లు , డి ఆర్ డి ఏ శ్రీనివాస్. డిసిఎంఎస్ . శ్యామ్ రెడ్డి. నాగార్జున తో పాటు తదితరులు పాల్గొన్నారు.



# సమస్యలను పరిష్కరించాలి

**వికారాబాద్, ఏప్రిల్ 10( ప్రజాస్వరం):**

వికారాబాద్ జిల్లా సిపిఐ పార్టీ తరపున వికారాబాద్ జిల్లా లోని వికారాబాద్ ,తాండూరు, పరిగి, కొడంగల్ నాలుగు నియోజకవర్గాల సమస్యల పరిష్కారం కోసం జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిత్ ఆధ్వర్యంలో గురువారం తాండూరు ఆర్డీవోకు వినతి పత్రం అందించారు. పెంచిన గ్యాస్ సిలిండర్ ధరలను వెంటనే తగ్గించాలి. తాండూర్ పట్టణంలో నుంచి ప్రవహిస్తున్న మురికి నీటి కాలువ, (మోరి) నీళ్లు కాగ్న నదిలో వదలడం ద్వారా కాలుష్యంతో తాండూర్ చుట్టుపక్కల నారాయణపూర్ తదితర గ్రామాల ప్రజలు, పశువులు మంచినీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే ఆ నదిని కాపాడాలి. చిలుక వాగు కబ్జాకు గురి అయ్యి వర్షాకాలంలో చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడవలసిన పరిస్థితి, కావున హైడ్రా ద్వారా తాండూరు పట్టణంలోని చిలక వాగును రక్షించాలి. అక్రమ ఇసుక రవాణాను ఆపాలి తద్వారా ఈ ప్రాంత భూగర్భ జలాలను కాపాడాలి. రాయల్టీ లేకుండా ఇతర ప్రాంతాల నుండి వేల సంఖ్యలో లారీలు తాండూర్ ప్రాంతంలో ప్రవేశించడం వల్ల ఇక్కడి రోడ్లు దెబ్బతిని, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా ప్రభుత్వ ఆదాయానికి నష్టం వాటిల్లుతుంది. దీనిపై చర్యలు తీసుకోవాలి అని కోరారు. తాండూరు ప్రాంత పెన్నా సిమెంట్ కర్మాగారంలో పనిచేసే కార్మికులకు సరైన వేతనాలు ఇవ్వకుండా, కార్మికులపై ఇబ్బందుల కు గురి చేస్తున్నారు, కావున వారికి న్యాయం చేయాలి. ఈ ఎస్ ఐ ఆసుపత్రి కూడా వెంటనే ఏర్పాటు చేసి సంఘటిత, అసంఘటిత కార్మికులకు వైద్యం అందించాలన్నారు. నూతన వ్యవసాయ మార్కెట్ విధానం తీసుకురావడం ద్వారా కార్పొరేట్ మార్కెట్ బలపడి రైతులకు తీరని అన్యాయం జరుగుతుంది. ఈ విధానాన్ని వెనక్కి తీసుకోవాలి. దళిత, గిరిజన, మైనార్టీ, మహిళ ఈ వర్గాల పై జరుగుతున్న దాడి, కేంద్ర బిజెపి ప్రభుత్వం చేస్తున్న కుల,మత రాజకీయాలు, ఈ వర్గాలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను తీరని విఘాతం కలుగుతుంది., రాజ్యాంగ విలువలను, రాజ్యాంగాన్ని రక్షించాలి అని అన్నారు. సంవత్సరానికి కోటి ఉద్యోగాలని ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం ఉన్న ఉద్యోగాలను తీసివేస్తున్నారు, ఇతర పార్టీలు పాలించే రాష్ట్రాలను తీవ్ర అన్యాయానికి గురి చేస్తూ కేటాయించవలసిన నిధుల పట్ల వివక్ష చూపుతున్నందున సందర్భం, కక్షపూరిత వైఖరిని కేంద్ర ప్రభుత్వం మానుకోవాలి. కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా కార్యదర్శి రవీందర్ , సిపిఐ కార్యవర్గ సభ్యులు అనంతయ్య, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి సురేష్ కుమార్ , అబ్దుల్లా, జగదంబ, అనంతయ్య, పుష్ప, ఖాదర్, మంగమ్మ, విమలమ్మ, తదితరులు పాల్గొన్నారు.




# జై బాపూ జై భీమ్ జై సంవిధాన్‌ను విజయవంతం చేయాలి

**నార్సింగి ఏప్రిల్ 10 (ప్రజా స్వరం) :**

భారత రాజ్యాంగాన్ని విస్మరిస్తూ, మహాత్మా గాంధీ త్యాగాలను మరిపింపజేస్తూ కేంద్ర బిజెపి ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండ కడతామని జై బాపూ జై భీమ్ జై సంవిధాన్ మండల కో ఆర్డినేటర్ జూకంటి రాజా గౌడ్ అన్నారు. మండల వ్యాప్తంగా నిర్వహించే జై బాపూ జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి అధ్యక్షతన మండల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కార్యక్రమ కో ఆర్డినేటర్ రాజాగౌడ్ పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రాజాగౌడ్ కు ఈ సందర్భంగా పార్టీ నాయకులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం కో ఆర్డినేటర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు ఒకే కుటుంబంలా కలిసిమెలిసి ఉంటూ, పార్టీ అధిష్టానం ఇచ్చిన పిలుపును తూచా తప్పకుండా పాటిస్తూ, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమ ముఖ్య ఉద్దేశమైన రాజ్యాంగ పరిరక్షణ కోసం బిజెపి అవలంబిస్తున్న రాజ్యాంగ, ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని అన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి యాదగిరి యాదవ్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్, బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు కేశవులు, టీజేఎస్ జిల్లా నాయకుడు బాలరాజు గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ యెన్నం రాజేందర్ రెడ్డి, టెలికాం బోర్డు మాజీ సభ్యుడు అంచనూరి రాజేష్, కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు వినోద్ కుమార్, మండల ఫిషర్మెన్ అధ్యక్షుడు సుధాకర్, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు శంకర్ నాయక్, మండల కిసాన్ సెల్ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, ఎంఎస్ఎస్ఓ నాయకుడు రుక్మొద్దిన్, జహీర్, రాజేశ్వర్ గౌడ్, రవీందర్, ప్రభాకర్, సాదఖ్, బాఖర్, బాబా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# కేంద్రం కుట్రలను తిప్పి కొడదాం




## ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

**వికారాబాద్, ఏప్రిల్ 11 (ప్రజాస్వరం):**

కేంద్ర ప్రభుత్వ కుట్రలను తిప్పి కొడదాం అని వికారాబాద్ జిల్లా పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి అన్నారు. జై బాపు,జై భీమ్, జై సంవిధాన్ అనే నినాదంతో రాజ్యాంగ పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఇచ్చిన పిలుపు మేరకు పరిగి పట్టణంలో గురువారం నిర్వహించిన జై బాపు,జై భీమ్,జై సంవిదాన్ అభియాన్ రాజ్యాంగ పరిరక్షణ యాత్రలో స్థానిక నాయకులతో కలిసి డిసిసి అధ్యక్షులు పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... బిజెపి కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ సవరణ పేరిట చేస్తున్న ప్రయత్నాలు రిజర్వేషన్లకు ముప్పు తీసుకురావడమే లక్ష్యంగా కనిపిస్తున్నాయని అన్నారు.

# రజతోత్సవ సభను విజయవంతం చేద్దాం





## బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్

**వికారాబాద్, ఏప్రిల్ 10( ప్రజాస్వరం) :**

ఈ నెల 27 న వరంగల్ లో నిర్వహించనున్న బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభ ని విజయవంతం చేద్దామని వికారాబాద్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మెతుకు ఆనంద్ కోరారు. వికారాబాద్ పట్టణంలో గురువారం బిఆర్ఎస్ పార్టీ వికారాబాద్ జిల్లా ముఖ్య నాయకుల అంతర్గత సమావేశం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యేలు మహేష్ రెడ్డి, రోహిత్ రెడ్డి తదితరులతో కలిసి నిర్వహించిన ఈ సమావేశంలో వికారాబాద్ జిల్లా బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భవించి 27 ఏప్రిల్ తేదీతో 25 ఏండ్లు కావొస్తున్న శుభ తరుణంలో వరంగల్ లో నిర్వహించబోయే రజతోత్సవ సభకు పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి వికారాబాద్ జిల్లా నుంచి 150 నుండి 200 వరకు ప్రత్యేక బస్సులలో మరియు నాయకులు, కార్యకర్తల సొంత వాహనాలలో బయలుదేరడం జరుగుతుందని తెలిపారు. సమావేశానికి బయలుదేరేముందు ఉదయం జిల్లాలోని అన్ని పంచాయతీలు, వార్డుల్లో పార్టీ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. అనంతరం రజతోత్సవ బహిరంగ సభకు సంబంధించిన చలో వరంగల్ పోస్టర్ ని విడుదల చేశారు. ఈ సమావేశంలో మాజీ చైర్మన్ నాగేందర్ గౌడ్, బీసీ కమిషన్ మాజీ సభ్యులు శుభప్రద్ పటేల్,, గ్రంథాలయాల సంస్థ మాజీ చైర్మన్ రాజు గౌడ్, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ బైండ్ల విజయ్ కుమార్, రైతుబంధు జిల్లా మాజీ అధ్యక్షులు రామ్ రెడ్డి, వికారాబాద్ పట్టణ అధ్యక్షులు గోపాల్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ ఆశయాలను సాధించుదాం



**తాండూరు, ఏప్రిల్ 11 (ప్రజా స్వరం) :**

ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి ఆదేశాల మేరకు తాండూర్ మండల పార్టీ అధ్యక్షులు నాగప్ప ఆధ్వర్యంలో జై బాపు,జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమని తాండూర్ మండలంలోని గోనూర్, విరశేట్ పల్లి, నారాయణ పూర్ గ్రామాలల్లో పాదయాత్ర చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో డీసీసీబీ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా వైస్ చేర్మెన్ రవీందర్ గౌడ్, తాండూర్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు అనిల్, కొత్లాపూర్ గుడి చెర్మన్ నవీన్,రాందాస్,పురుషోత్తం రెడ్డి, పండరి, హరిశ్వరరెడ్డి, హర్షవర్ధన్ రెడ్డి, జర్నప్ప, రాము యాదవ్,ఉదయ్ భాస్కర్ రెడ్డి, పండరి, శ్రీనివాస్ గౌడ్, శ్రీశైలంగౌడ్,విజయ్, జగదీష్,ఇస్మాల్,జగదీశ్, శాంతు కుమార్, ప్రభాకర్ రెడ్డి, గోపాల్ రెడ్డి, వెంకటేష్, మల్లప్ప, గ్రామ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు . కాగా బషీరాబాద్ మండలంలో కూడా రొండవ రోజు జై బాపు,జై భీమ్,జై సంవిధాన్ పాదయాత్ర చేపట్టారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శంకర్ రెడ్డి, అజయ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.




# షారుఖ్ తర్వాత నేనే గ్రేట్..!!

బాలీవుడ్ హాట్ బ్యూటీ ఊర్వశి రౌతేలాకు పాన్ ఇండియా మార్కెట్లో మంచి క్రేజ్ ఉంది. సినిమాల్లో హీరోయిన్ గా కంటే కూడా ఐటెం సాంగ్స్ తోనే బాగా ఫేమస్ అయింది. మొన్న బాలయ్య "డాకు మహారాజ్" సినిమాలో ఐటెం సాంగ్ చేసి మంచి గుర్తింపు పొందింది. అయితే తాజాగా ఆమె ఓ ఇంటర్వ్యూలో పాల్గొని ఆసక్తికర కామెంట్లు చేసింది. 'నేను ఎప్పుడూ నా పని గురించే ఆలోచిస్తుంటాను. నేను చేసే సినిమాలకు మంచి ప్రమోషన్లు చేయడం కోసం ఏమైనా చేస్తాను. ఈ విషయంలో మీరు అందరూ నన్ను పొగడాలి. ఎందుకంటే ఇండస్ట్రీలో షారుఖ్ ఖాన్ తర్వాత సినిమాల ప్రమోషన్లు చేసేది నేనే. ఆ విషయంలో అందరూ నన్ను గుర్తించాలి' అంటూ సెల్ఫ్ గోల్ చేసుకుంది.

'నేను సినిమాల కోసం చాలా ప్రమోషన్ ఈవెంట్లు చేస్తాను. నేను గతంలో చేసిన సినిమాలను చూస్తే మీకే తెలుస్తోంది. హాలీవుడ్ సినిమాలకు ఇండియాలో నన్ను ప్రమోషన్ చేయమని అడుగుతున్నారు. కానీ నేను చేయనని చెప్పాను. నేను చేస్తున్న సినిమాలకు ప్రమోషన్లు చేయడంలో బిజీగా ఉంటాను. నేను చేసే సినిమాల పట్ల బాధ్యతతో ఉంటాను' అంటూ చెప్పుకొచ్చింది. ఆమె ఇలా సెల్ఫ్ డబ్బా కొట్టుకోవడంపై నెటిజన్లు ఏకి పారేస్తున్నారు. ఈ మాత్రం దానికి ఏదో గొప్ప చెప్పుకోవడం ఏంటి అంటున్నారు.

# ఎస్ఎస్ఎంబీ29 కూ రాజమౌళి సెంటిమెంట్ రిపీట్..!






సూపర్ స్టార్ మహేష్ బాబు రాజమౌళి దర్శకత్వంలో "ఎస్ఎస్ఎంబీ29" అనే సినిమాలో నటిస్తున్నాడు. కీరవాణి సంగీతం అధిస్తున ఈ సినిమాలో ప్రియాంక చోప్రా, పృథ్వీరాజ్ నటిస్తున్నారు. ఇటీవలే ఒడిశాలోని కోరాపుట్ జిల్లాలో సెకండ్ షెడ్యూల్ ను పూర్తి చేసారు. తాజాగా ఈ సినిమా గురించి ఒక అదిరిపోయే అప్డేట్ వచ్చింది.

ఈ సినిమా రిలీజ్ డేట్ ను రాజమౌళి ఫిక్స్ చేసారు అని సినీ వర్గాల్లో టాక్ నడుస్తుంది. ఈ సినిమాని 2027లో మార్చి 25న విడుదల చేయాలనీ ప్లాన్ చేస్తున్నారు అని సమాచారం. అయితే 2022లో అదే తేదీన విడుదలైన ''ఆర్ఆర్ఆర్'' సినిమా ప్రపంచవ్యాప్తంగా భారీ విజయం సాధించింది. ఈ క్రమంలో ఆ డేట్ రాజమౌళి కి సెంటిమెంట్ కావడంతో మహేష్ సినిమాను కూడా అదే రోజు రిలీజ్ చేయాలనీ రాజమౌళి చూస్తున్నారు. యాక్షన్ అడ్వెంచర్ డ్రామాగా రాబోతున్న ఈ సినిమాని దాదాపు 1500 కోట్లు బడ్జెట్ తో నిర్మిస్తున్నారు.



# ఒక్క ఫ్లాప్‌తో రష్మిక సీన్ రివర్స్..!!

రష్మిక మందన్నా ప్రస్తుతం వరుస విజయాలతో దూసుకుపోతుంది. ఈ భామ హీరోయినిగా చేస్తున్న ప్రతి సినిమా బాక్సాఫీస్ భారీ కలెక్షన్స్ రాబెడుతున్నాయి. వరుస విజయాలు తర్వాత.. సల్మాన్ ఖాన్ తో నటించిన "సికందర్" సినిమాపై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. అయితే 'పుష్ప', 'యానిమల్', 'ఛవా' లాగా "సికందర్" సినిమా కూడా సూపర్ హిట్ అవుతుందనే ఆశ అడియాసలైంది. సల్మాన్ ఖాన్, రష్మిక మందన్న జంటగా నటించిన "సికందర్" సినిమా ప్రేక్షకులను ఆకట్టుకోలేకపోయింది.ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఘోరంగా పరాజయం పాలైంది.

ఈ క్రమంలో రష్మిక కెరీర్ కు పెద్ద దెబ్బ తగిలింది. ఈ సినిమా ఫ్లాప్ కావడంతో రష్మికకు డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగ షాక్ ఇచ్చాడు. 'యానిమల్' సినిమా తరువాత డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా ప్రభాస్ తో "స్పిరిట్" అనే సినిమా తీస్తున్నాడు. ఈ సినిమాలో సందీప్ రష్మిక మందన్నను హీరోయిన్‌గా ఎంపిక చేసుకున్నట్లు సమాచారం. ఇప్పుడు "సికందర్" సినిమా ఫ్లాప్ తర్వాత చిత్ర బృందం ప్రభాస్ సినిమా నుండి రష్మికను తొలగించి ఇతర హీరోయిన్ల కోసం వెతుకుతున్నట్లు సమాచారం. రష్మిక ప్రభాస్ తో చేయబోయే సినిమాపై చాలా ఆశలు పెట్టుకుంది. అయితే ఇప్పుడు ఆ ఆశలు అన్ని అడియాశలు అయిపోయాయి.

# అకీరా కొత్త లుక్ చూశారా..

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ కొడుకు అకీరా నందన్ పేరు ఇప్పుడు టాలీవుడ్ లో హాట్ టాపిక్ గా మారింది. ఈ ఈ కుర్రాడు తన లుక్స్ తో సోషల్ మీడియాను షేక్ చేస్తున్నాడు. అలాగే తన సినీ ఎంట్రీ కోసం మెగా అభిమానులు ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం అకీరా నందన్ ప్రస్తుతం అమెరికాలో యాక్టింగ్, మ్యూజిక్ కోర్సులు నేర్చుకుంటున్నాడు. ఇటీవలే అకీరా నందన్ పుట్టినరోజు (ఏప్రిల్ 8) సందర్భంగా రేణు దేశాయ్ ఒక ఫోటోను షేర్ చేసింది. ఈ ఫోటో చూస్తుంటే అకీరా నందన్ అచ్చం పవన్ కళ్యాణ్ లాగా కనిపిస్తున్నాడు. ఈ ఫోటోలో అకిరా మీసాలు చూస్తూనే పవన్ గత సినిమాల్లో లుక్స్ లాగా ఉన్నాయి. ప్రస్తుతం అకీరా నందన్ 21 ఏళ్ల వయసు.. అయితే ఫ్యాన్స్ అకీరా హీరోగా ఎంట్రీ ఇస్తే బాక్సాఫీస్ షేక్ అవుతుంది అంటున్నారు. ఇప్పటికే అకీరా ఎంట్రీపై రేణు దేశాయ్ క్లారిటీ ఇచ్చింది. అకీరా "ఓజీ" సినిమాలో నటించడం లేదని, అవన్నీ ఫేక్ న్యూస్ అని స్పష్టం చేసింది. అకిరా తనంతట తానుగా సినిమాల్లోకి రావాలనుకుంటున్నానని చెబితే.. ఆ విషయాన్ని నా ఇన్‌స్టాగ్రామ్ ద్వారా అందరికీ నేనే చెబుతాను అని రేణు దేశాయ్ అన్నారు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502336. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502336,
EDITOR: PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2006/17154, CELL : 8008609999